కళ్లకలక ప్రమాదకరం కాదు

- జాగ్రత్తలతోనే ఉపశమనం - కంటి వైద్య నిపుణులు డాక్టర్ ప్రీతం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కళ్ల కలక వైరస్ ఇన్‌ఫెక్షన్ వల్ల వస్తుందని, ఈ వ్యాధి అడినో వైరస్, ఎంటరో వైరస్ బ్యాక్టీ రియా ద్వారా వ్యాప్తి చెందుతుందని, ప్రారంభంలో ఒక కన్నుకు సోకిన కళ్లకలక మరో కన్నుకు వ్యాపిస్తుందని కంటి వైద్య నిపుణులు డాక్టర్ ప్రీతం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల తరువాత కళ్లకలక విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న తరుణంలో ప్రజాశక్తి డాక్టర్ ప్రీతంలో ప్రస్తావించింది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వ్యాధి లక్షణాలు కళ్లు ఎర్రబడటం, నీరు కారటం, కళ్లను ఒత్తుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం ఈ వ్యాధి విద్యార్థి వసతి గృహాలలో ప్రారంభమైంది. ఈ వ్యాధి నియంత్రణకు తగిన జాగ్రత్తలు పాటించకపోతే ప్రతి ఒక్కరికి వచ్చే అవకాశం ఉంది. వ్యాధి నియంత్రణకు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కళ్లకలక వ్యాధిపై ముందుగా అపోహలు వీడాలి. ఈ వ్యాధి వచ్చిన వారి కళ్లల్లోకి చూస్తే వస్తుందని ప్రచారంలో ఉంది. ఇది అపోహమాత్రమే. ఈ వ్యాధి సోకిన వారి వస్తువులు అంటే కళ్లు తుడుచుకున్న చేతి రుమాలును ఇతరులు వాడితే వారికి వ్యాధి సోకుతుంది. ఇది నిజం. వ్యాధి వచ్చినవారు జనరల్ ట్రీట్‌మెంట్ తీసుకునేందుకు మందుల షాపు వద్దకు వెళ్లి యాంటీబయాటిక్స్ మందులు వాడటం చేయవద్దు. ఇలా వాడితే వ్యాధి తగ్గిపోతుంది అనడం అపోహ. దీనివల్ల వ్యాధి నియంత్రణ కాకపోగా అధికం అయ్యే అవకాశం ఉంది. వ్యాధి సోకిన వారు వెంటనే సమీపంలోని కంటి వైద్యుని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. కళ్లల్లో ఎరుపు తగ్గితే వ్యాధి పోయిందనుకోవడం అపోహ. ఈ వ్యాధి మందులు వాడినా వాడకపోయినా పది నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. ఈ వ్యాధి అంత ప్రమాదకరమైనది కాదని గుర్తించాలి.

జాగ్రత్తలు: కళ్లు ఎర్రబడిన వెంటనే కంటి వైద్యుని సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత కళ్ల కలక అవునా కాదా ఇతర ఏదేని కంటి వ్యాధి అని తెలియచేస్తారు. కళ్లకలక సోకిన వారిని ప్రత్యేక గదిలో ఉంచాలి. చికిత్స అందించాలి. ప్రజల మధ్యకు వెళ్లకుండా ఉండాలి. కళ్ళను శుభ్రం చేసే సామాగ్రిని ఇతరులు ముట్టుకోకుండా చూడాలి. ఇది సీజనల్ వ్యాధి. ఈ వ్యాధి వర్షాకాలంలో ప్రభలుతుంది వర్షం కురిసిన తర్వాత భూమిలో ఉన్న వైరస్ భూమిపైకి లేస్తుంది. ఈ వైరస్ వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న చిన్నారులు వృద్ధులపై ప్రభావం చూపుతుంది. అనంతరం ఒకరి నుంచి ఒకరికి వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. గత రెండేళ్ల క్రితం కరోనా పాండమిక్ ద్వారా విస్తరించి జన బాహుల్యాన్ని అతలాకుతలం చేసింది. కరోనా తర్వాత తొలిసారిగా ఈ ఏడాది కల్ల కలక వచ్చింది. మనుషులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీని వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని నడుచుకోవాలి. ఇప్పటివరకు సుశీల నేత్రాలయ ఆసుపత్రిలో గత 40 రోజుల నుంచి పరిశీలిస్తే కళ్లకలక వ్యాధిగ్రస్తులు సుమారు 1000 మంది వచ్చారు. వారందరికీ వ్యాధికి చికిత్స చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హాస్టల్ విద్యార్థులలో ఈ వ్యాధిని గమనించిన వెంటనే విద్యార్థులను మిగతా విద్యార్థుల నుంచి వేరుచేసి సిక్ రూమ్‌కి తరలించి ప్రత్యేక చికిత్సలు చేయించి జాగ్రత్తలు పాటించాలి.

కంప్యూటర్‌లో కళ్లకలకను నిర్ధారించిన కన్ను - డాక్టర్ ప్రీతం

రాయలసీమ ద్రోహి జగన్

- టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే ఒక జిఒను తీసుకు వచ్చి మొత్తం రాయలసీమ ప్రాంతంలోని 102 ప్రాజెక్టుల పనులను రద్దుచేసి రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయారని టిడిపి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి నాయుడు అన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో నాయకులు కోట్ల సుజాతమ్మ, కెయి.ప్రభాకర్, కె.మీనాక్షినాయుడు, పి తిక్కారెడ్డి, బివి జయనాగేశ్వరరెడ్డి, ఆకేపోగు ప్రభాకర్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, వై.నాగేశ్వరరావు యాదవ్, పిజి నర్సింహులు యాదవ్ తో కలిసి ఏర్పాటుచేసిన పత్రికా, మీడియా ప్రతినిధుల సమావేశంలో బిటినాయుడు మాట్లాడారు. రాయల సీమ ప్రాజెక్టుల కోసం టిడిపి హయాంలో రూ.12,411 కోట్లు ఖర్చుచేస్తే వైసిపి ఖర్చు చేసింది రూ.2011 కోట్లు మాత్రమేనని అన్నారు. ఎడారిలా ఉన్న రాయలసీమ ప్రాంతాన్ని సశ్యశ్యామలం చేసేందుకు, తీవ్ర నీటిఎద్దడి తీర్చడానికి టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి. రామారావు తెలుగు గంగ, గాలేరునగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులను తీసుకువచ్చారని గుర్తుచేశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్లో 9.63 శాతం నిధులు టిడిపి ఖర్చుచేస్తే వైసిపి కేవలం 2.35శాతం నిధులు ఖర్చుపెట్టిందని అన్నారు. ఈ నిధులు కూడా కేవలం తమకు కావలసిన కాంట్రాక్టు సంస్థలకు దోచిపెట్టారని ఆరోపించారు. రాయలసీమకు ఇంత తక్కువగా ఖర్చుచేసిన జగన్ సీమద్రోహి కాదా? సీమ వాసి అయిన ఆయనకు సీమ వాసుల నీటి కష్టాలు తీర్చాల్సిన బాధ్యత ఉందా! లేదా? అని ప్రశ్నించారు. గతంలో వారి తండ్రి వైఎస్. రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరుతో సుమారు రూ.5 వేల కోట్ల మేరకు అవినీతికి పాల్పడినట్లు దర్యాప్తు సంస్థలు వెల్లడించాయన్నారు. వైఎస్.జగన్ నీటిపారుదల ప్రాజెక్టుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించేందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు రాష్ట్రంలో 10 రోజుల పాటు సాగునీటి ప్రాజెక్టుల సందర్శన చేపట్టనున్నారని, ఆగస్టు 1న ఉమ్మడి కర్నూలు జిల్లానుండి ప్రారంభించ నున్నారని తెలిపారు. రాయలసీమ బ్రైట్ మిటిగేషన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు క్రియేట్ చేసి 23 ప్రాజెక్టులకు రూ. 35 వేల కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ వ్యహారం అంతా పెద్ద దోపిడి అని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిటి.నాయుడు

విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

- ఎపి విద్యుత్తు ఉద్యోగుల వర్కర్స్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్

- ఎఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యల పరిష్కరించాలని ఆదివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ జెఎసి రాష్ట్ర నాయకులు బ్రహ్మానందరెడ్డి, నాయబ్ రసూల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగస్తుల న్యాయమైన సమస్యల పరిష్కరించాలన్నారు. కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. మన ముఖ్యమంత్రి అధికారంలోకి రాక ముందుకు విద్యుత్తు కార్మికుల సమస్యలు న్యాయమైన డిమాండ్లు తాము అధికారంలోకి వస్తే పరిష్కారం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యుత్ కార్మిక సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. విద్యుత్తు ఉద్యోగుల 45 శాతం ఫిట్‌మెంటుతో పిఆర్‌సిని అమలు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికుల వారి ఉద్యోగంలో రెగ్యులైజేషన్ చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని జెఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలన్నారు. జెఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్ మరణించిన వారి కుటుంబంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించి వారికి ఎపిఎస్ఇబి సర్వీస్ రూల్స్‌ను అమలుపరచుటకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు ఇపిఎస్ నుండి జిపిఎఫ్‌గా మార్పు చేసి అందరికీ పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు, కార్మికులుగా నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీని అమలు చేయుటకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. విద్యుత్తు సంస్థలో గుర్తింపు కొరకు కార్మిక సంఘాలుగా ఎన్నికలు జరుపుటకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించుటకు తగు చర్యలు చేపట్టాలనే డిమాండ్ల సాధన కోసం దశలవారీగా ఉద్యమంలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, మనోహర్ మాణిక్యం, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు సురేష్ బాబు, డిస్కం ప్రెసిడెంట్ ఎఐటియుసి నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, అధ్యక్షులు బి. వెంకటేష్, విద్యుత్తు ఉద్యోగ సంఘం నాయకులు నవీన్, శ్రీనివాసులు, రామాంజనేయులు, ఎఐటియుసి నాయకులు రామాంజనేయులు, రహిమాన్, మహమ్మద్, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు బ్రహ్మానందరెడ్డి

పెంపుడు జంతువులకు అత్యవసర వైద్యం

- ప్రతి శుక్రవారం కోళ్లకు వ్యాక్సినేషన్
- ప్రతి రోజు 50 కుక్కల దాకా వైద్య పరీక్షలు
- ప్రజాశక్తితో బహుళార్థక పశువైద్యశాల వైద్యులు హేమంత్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

పెంపుడు జంతువులకు అత్యవసర వైద్యం అందిస్తున్నట్లు బహుళార్థక పశు వైద్యశాల వైద్యులు హేమంత్ కుమార్ తెలిపారు. ప్రతి శుక్రవారం కోళ్లకు వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ 50 కుక్కల దాకా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తితో ముఖాముఖి సందర్భంగా ఆయన పలు విషయాలను వెల్లడించారు....

ఎన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి?

డాక్టర్ : మూగ జీవాలకు సంబంధించిన ఆవులు, బర్రెలు, కుందేళ్లు, తాబేళ్లు, పిల్లులు, కుక్కలు, ఎద్దులు, ఇలాంటి అన్ని రకాల జంతువులకు వైద్య సదుపాయాలు ఉచితంగా అందిస్తున్నాము. ప్రభుత్వమే మందులు సైతం ఉచితంగా ఇస్తోంది. అత్యవసర సేవలు సైతం పశు అంబులెన్స్ ద్వారా సేవలు అందిస్తున్నాము.

ఎక్కువ సంఖ్యలో వస్తున్న జంతువులు ఏంటి? ఎలాంటి వ్యాధులతో వస్తున్నాయి?

డాక్టర్ : ఎక్కువగా కుక్కలు నిత్యం 50 నుండి 70 దాకా వస్తున్నాయి. వాటికి టీకాలు, కొన్నింటికి ఆపరేషన్స్, కొన్నింటికి గాయాలు కట్లు కట్టడం, ఆరోగ్య సమస్యలు, మనుషులకు వచ్చే వ్యాధుల లాగే కుక్కలకు జ్వరాలు వస్తుంటాయి. ఇక్కడకు వచ్చే కుక్కల వ్యాధులను బట్టి వైద్యాన్ని అందించి పంపుతాం.

నగరంలో చాలా ఎక్కువ సంఖ్యలో కుక్కల పెంపకం జరుగుతోంది. వాటికి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారా?

డాక్టర్ : నగరంలో చాలా ఎక్కువ సంఖ్యలో కుక్కల పెంపకం జరుగుతుంది. టీకాలు ఉచితంగా వేసిన రోజు ఒకే రోజు 100కు పైగా కుక్కలు తీసుకొచ్చారు. వాటికి అన్నిటికీ ఉచితంగా టీకాలు వేశాము. కుక్కలకు పుట్టిన 60 రోజులు నుండి టీకాలు వేయాలి. టీకా వేశాక నెల రోజులకు 52 జబ్బులకు సంబంచిన ఒక వ్యాక్సిన్ వేస్తాము. తరువాత 3 నెలల్లో బూస్టర్ డోస్ వేయించాలి. రేబిస్ వ్యాధి రాకుండా టీకాలు కూడా వేస్తున్నాము. దాదాపు ఇంట్లో పెంచుకునే వాటికి టీకాలు వేయిస్తున్నారు. వేయించడం వల్ల అందరికి మంచిది.

ఆపరేషన్స్ చేయడానికి సదుపాయాలు ఉన్నాయా?

డాక్టర్ : అత్యవసరంగా ఆపరేషన్ చేయడానికి కూడా ఆపరేషన్ థియేటర్ ఉంది. కొన్నింటికి మత్తు ఇచ్చి చేయాలి. కొన్నింటికి లేకుండా చేయవచ్చు. ఆపరేషన్ చేసిన వాటికి సంబంధిత యజమాని నిర్ణయం మేరకు చేస్తాము. చేశాక ఇంటికి పంపిస్తాము. ఆపరేషన్ కూడా ఉచితంగా చేస్తాము. మత్తు సూదిని మాత్రమే యజమాని కొనుక్కోవాలి. మిగతా అన్ని సేవలు ఉచితంగా అందిస్తాము.

కోళ్లకు కూడా ప్రత్యేక రోజును కేటాయించారా ?

డాక్టర్ : కోళ్లకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల దాకా ఉచితంగా టీకాలు వేస్తున్నాము. ఎలాంటి వైద్యాన్ని అయిన అందిస్తున్నాము. ఒక రోజు కేటాయించడం వల్ల వచ్చే వారికి అన్ని సదుపాయాలు, డాక్టర్లు ఆ రోజు కోళ్ల కోసం మాత్రమే సమయాన్ని కేటాయించుకుంటాం. కోళ్లకు సంబందించిన అన్ని జబ్బులకు నిత్యం కూడా వైద్యాన్ని అందిస్తున్నాము.

అవులకు, బర్రెలకు కృత్రిమ గర్భధారణ చేస్తున్నారా? ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

డాక్టర్ : బర్రెలకు ముర్ర జాతి రకం కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ అందుబాటులో ఉంది. అవులకు ఒంగోలు, జెర్సీ, హెచ్ఎఫ్ ,షాహివాల్(హర్యానా), గిర్ ఫీడ్,(గుజరాత్ జాతి) ఇలాంటి రకాల కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ అవులకు వేస్తున్నాము. పాల కోసం, కొన్ని రకాల దూడలు బాగుండటం కోసం కొన్ని రకాల జాతులకు వేయిస్తున్నారు. రైతుల కోరిక మేరకు "ఎద" ఇంజక్షన్ వేస్తున్నాము.

'ఎద' ఇంజక్షన్ ఉచితంగా అందిస్తున్నారా? ఎన్నిసార్లు వేస్తున్నారు?

డాక్టర్ : ప్రభుత్వ పశువుల ఆసుపత్రులలో ఎలాంటి రకం జాతి 'ఎద' ఇంజక్షన్ అయిన జూలై నెల చివరి దాకా ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. అందులో భాగంగా నెలాఖరు వరకు ఉచిత 'ఎద' ఇంజక్షన్లు వేస్తున్నాం. రైతులు త్వరగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి.కొన్నిసార్లు ఒక్కసారి ఎద ఇంజక్షన్‌కే గర్భధారణ నిలుస్తుంది. కొన్నిసార్లు రెండు సార్లు కూడా వేయించాల్సి వస్తుంది.జూలై నెల తరువాత ఒక ఎద ఇంజక్షన్‌కు రూ.40 తీసుకుంటాము. దానికి రసీదు కూడా ఇవ్వబడును. ప్రభుత్వమే ఈ సేవలు రైతులకోసం అందిస్తుంది.

ముఖాముఖి

కొనసాగుతున్న వరద

- క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతూ ఉండడంతో క్రమంగా జలాశయ నీటిమట్టం పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 41,252 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 1310 క్యూసెక్కులతో కలిపి మొత్తం 42,562 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 846.70 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 73.2313 టిఎంసిలుగా నమోదయింది. ప్రస్తుతానికి రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం లేదు.

హొళగుంద : తుంగభద్ర జలాశయానికి ఎగువ కర్ణాటక నుంచి 48,058 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయ ప్రస్తుత నీటి మట్టం 1624.23 అడుగులుగా, ప్రస్తుత నీటి నిల్వ 74.003 టిఎంసిలుగా ఉంది.

సీనియర్ ఎస్‌జిటిలకు పదోన్నతి కల్పించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సురేష్‌కుమార్ వినతిని ఇస్తున్న సీనియర్ ఎస్‌జిటిలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని సీనియర్ ఎస్‌జిటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రైవేట్ కళాశాలలో సీనియర్ ఎస్‌జిటి ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు లతీఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, ఎస్‌జిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్, జయరాజు మాట్లాడుతూ మే నెలలో నిర్వహించిన పదోన్నతులలో కొంతమంది ఉపాధ్యాయులు నాట్‌విల్లింగ్ ఇచ్చారని, ఈ నేపథ్యంతో ఇటీవల నిర్వహించిన పదోన్నతులలో అవకాశం కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పుడు మానవతా దృక్పథంతో విద్యాశాఖ అధికారులు స్పందించి వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఎస్‌జిటి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని వారు హామీ ఇచ్చారు. లక్ష్మయ్య మాట్లాడుతూ సీనియర్లుగా పనిచేసి పదోన్నతులు పొందకపోవడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. అనంతరం యుటిఎఫ్ నేతలకు సీనియర్ ఎస్‌జిటి ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో సీనియర్ ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, రామకృష్ణ ,ఫారుక్ శశికళ, సాయి లక్ష్మీదేవి, ఉషా ,అరుణ పాల్గొన్నారు.

అణచివేయాలని చూస్తే పైకి ఎదుగుతా

కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రత్యర్థులు తనపై ఎన్ని విమర్శలు చేస్తూ అంచవేయాలని చూస్తే అంత ఎత్తుకెదుకుతానని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక ఐదవ వార్డులోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వం చేస్తున్న పనులను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి టిడిపి పచ్చ తమ్ముళ్లకు అర్థం కాక సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. కరోనా సమయంలో కూడా తన టిడిపి నేతలు తప్పుప్రచారం చేశారన్నారు. చైనా నుంచి కరోనా తీసుకొచ్చానని, భూకబ్జాకుపాల్పడ్డానని, అసత్య ఆరోపణాలు చేసి రాజకీయంగా దెబ్బతీయాలని చూశారన్నారు. ఏ ఒక్క ఆరోపణ ఇప్పటివరకు నిరూపించలేదన్నారు. చంద్రబాబు నాయుడులా తాను ఓటుకు నోటు కేసులో ఇరుక్కోలేదని, వాస్తవాలే చెప్తున్నానని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. నేను ఏ ఒక్కరికి నష్టం చేయలేదన్నారు. తనపై బురద చల్లేందుకు మహిళలను అడ్డుపెట్టుకొని చంద్రబాబు, కర్నూలు టిడిపి నేతలు చేస్తున్నారు అన్నారు. రాజకీయ లబ్ధికోసం కర్నూలు టిడిపి నేతలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు. రెండేళ్లక్రితం జరిగిన సంఘటనను వక్రీకరించి, టిడిపి నేతలు సోషల్ మీడియా పని కట్టుకొని ప్రచారం చేస్తున్నారన్నారు. టిడిపి నేతల తప్పుడు ప్రచారంపై నేను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, వార్డు ఇన్‌ఛార్జి, వైసిపి నాయకులు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

రెవెన్యూ ఉద్యోగుల డివిజన్ అధ్యక్షుడుగా రామాంజనేయులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్య క్షుడిగా డిప్యూటీ తహశీల్దార్ రామాంజనేయులు ఎన్నికయ్యారు. డివిజన్ కార్యదర్శిగా డిప్యూటీ తహ శీల్దార్ వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం కర్నూలు డివిజన్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ పర్యవేక్షకుడుగా జిల్లా ప్రధాన కార్యదర్శి గిరికుమార్ రెడ్డి వ్యవ హరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డివిజన్ కమిటికి కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్ అభినందనలు తెలిపారు. ఈ కమిటీకి సహాధ్య క్షులుగా శివరాం, ఉపాధ్య క్షులుగా శేషపని, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి సహాయ కార్యదర్శులుగా జగదీశ్వర రావు, నూర్ అహ్మద్, వెంక టేశ్వర్లు, కోశాధికారిగా సహరా భానులతో పాటు మరి కొంత మంది జిల్లా కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

రామాంజనేయులు

ఎమ్మెల్యే ఉన్నట్టా.. లేనట్టా..: కోట్ల

ప్రజాశక్తి-సి బెళగల్

కోడుమూరు నియోజకవర్గంలో ఓట్లు రాల్చుకుని సొంత అభివృద్ధి తప్ప ప్రజల అభివృద్ధి సూన్యమని, ఎమ్మెల్యే ఉన్నట్టా లేనట్టా అని మాజీ కేంద్ర మంత్రి కోట్లజయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం గొల్లలదొడ్డిలో వెంకటేష్ గౌడ్ నివాసానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి పనులు ఎన్నో చేశామని, చేయాల్సిన అభివృద్ధి కోసం శ్రమిస్తున్నా గత ఎన్నికల్లో జగన్‌మాయలో పడి వైసిపికి ఓట్లేసిన ఫలితంగా రాష్ట్రం అప్పుల పాలయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కోడుమూరు ఎమ్మెల్యేగా, ఎంపీగా టిడిపి అభ్యర్థులను గెలిపిస్తే గుండ్రేవుల డ్యామ్‌ను,సిబెళగల్ చెరువు రిజ ర్వాయర్‌ను ఏడాదిలోపు నిర్మిస్తా మన్నారు.

విద్యార్థి కుటుంబానికి పరామర్శ: గొల్లలదొడ్డి గ్రామంలో శనివారం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బిటెక్ విద్యార్థి శేఖర్ కుటుంబాన్ని కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కొడుకు లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు.

డిఆర్‌సి వారి నూతన వెంచర్ 'శ్రీ హరి నేచర్ నెక్స్' ప్రారంభం

పాణ్యం ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న డిఆర్‌సి బృందం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరం నందికొట్కూరు మార్గంలో డిఆర్‌సి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి నూతన వెంచర్ **'శ్రీ హరి నేచర్ నెక్స్'** ను ఆదివారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెలే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు ఎమ్మెలే హాఫీజ్ ఖాన్, నందికొట్కూరు ఎమ్మెలే ఆర్థర్ , నగర మేయర్ బివై.రామయ్య, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో ఎంతో అనుభవంతో కష్టమర్ల మన్నలను, నమ్మకాన్ని పొందుతూ వస్తున్న డిఆర్‌సి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండి డి.రామచంద్రయ్యను వారు అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రాజెక్ట్స్ మరిన్ని ప్రారంభించాలన్నారు. అనంతరం ఆ సంస్థ యజమాని డి.రామచంద్రయ్య మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకానికి ఏమాత్రం తగ్గకుండా ఈ నూతన ప్రాజెక్ట్‌ను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఎప్పటిలాగే ఈ వెంచర్‌ను నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఇంజనీర్ల చేత వాస్తుకు ప్రాధాన్యం ఇస్తూ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. నాణ్యత విషయం అడుగడుగునా పరిశీలించి నిర్ణయించు కునే సౌకర్యం కష్టమర్ల సొంతమని తెలిపారు. 24 గంటల విద్యుత్ చక్కటి బీటీ, సిసి రోడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆకర్షణీయమైన డిజైన్లతో చూడముచ్చటయిన ఇంటి నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకుంటారని ఆకాంక్షించారు. భవిష్యత్తులో 20 అంతస్తులతో ఒక ప్రాజెక్టును నిర్మించబోతున్నామన్నారు. కర్నూలులో ఇదే అతి పెద్ద ప్రాజెక్ట్ కానుందని అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన రాజకీయ ప్రముఖులకు కష్టమర్లకు విచ్చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నందికొట్కూరు ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న డిఆర్‌సి బృందం

చిన్నారి తైక్వాండో క్రీడాకారిణికి ఎల్లో బెల్టును ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రీడలతో ఆరోగ్యం , క్రమశిక్షణ

ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

మార్షల్ ఆర్ట్స్ లాంటి క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం పెరుగుతాయని అందుకే తైక్వాండో, కరాటే లాంటివి సాధన చేయాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. ఆదివారం కర్నూలు సిపిఐ కార్యాలయంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు కలర్ బెల్టుల ప్రదానోత్సవానికి డాక్టర్ శంకర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరాయ్యారు. ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లాంటి క్రీడల సాధనతో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. ముఖ్యంగా అమ్మాయిలకు ఈ సమాజంలో ఎదువరుతున్న దురాగాతాలను ఎదుర్కోవడానికి , ధైర్యంగా ప్రశ్నించడానికి ఉపయోగపడుతాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలను మార్కులు, మనీ సంపాదనపైనే దృష్టపెట్టడమే కాకుండా క్రీడలపట్ల ఆసక్తి పెంచాలన్నారు. నిరంతర క్రీడాసాధనతో భవిష్యత్తులో బిపి, షుగర్, గుండె జబ్బులను నివారించవచ్చన్నారు. చైనా , జపాన్ తదితర అభివృద్ధిలో ముందున్న దేశాల కంటే మన దేశంలో యువత ఎక్కువగా ఉన్నారని, వారందరికీ సమాజం పట్ల అంకిత భావం , దేశభక్తి, పెంచడానికి క్రీడలు తోడ్పడుతాయని అన్నారు. తైక్వాండో క్రీడాకారుల విన్యాసాలను తిలకించి కోచ్ జి. షబ్బీర్‌హుస్సేన్‌ను , క్రీడాకారులను డాక్టర్ శంకర్‌శర్మ అభినందించారు. ఈకార్యక్రమంలో సిపిఐ నగరకార్యదర్శి కె.రామకృష్ణారెడ్డి, జర్నల్ సర్జన్ డాక్టర్ చిట్టిబాబు, ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌ఛార్జి పాగుగంటి చంద్రయ్య, తైక్వాండో కోచ్ జి.షబ్బీర్‌హుస్సేన్, కోచ్ ఖాజాహుస్సేన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు జీవితాన్ని ఆవిష్కరించిన పడమటిగాలి

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ : రైతుబతుకు ముఖచిత్రంగా రైతుజీవితాన్ని ఆవిష్కరించిన సాంఘిక నాటకం పడమటిగాలి అని ప్రముఖనాటక దర్శకులు పాటిబండ్ల ఆనందరావు అన్నారు. నగరంలోని సి.క్యాంప్ టిజివి కళాక్షేత్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరవు కాటకాలతో, అప్పులతో రైతుకుంగిపోకూడదని, ప్రకతి వైపరిత్యాలొచ్చినా ధైర్యంగా ఎదుర్కొని నిలబడాలన్న అంశంతో రచించిన నాటకం పడమటగాలి అన్నారు. ఈ నాటకానికి సీనియర్ ఐఎస్ అధికారి బలరామయ్య దర్శకత్వం వహిస్తు న్నారని అన్నారు. సాంఘీకనాటకాలకు భారతీయ నాటక సమాజంలో అత్యంతగుర్తింపు ఉందన్నారు. ఈ సమావేశంలో నంది అవార్డుగ్రహీత పత్తిఓబులయ్య పాల్గొన్నారు..

గ్రామ పెద్దలకు విరాళం అందజేస్తున్న మంత్రి

స్వగ్రామానికి ఎంత చేసినా తక్కువే

- గుమ్మనూరు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- శివాలయ నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం

ప్రజాశక్తి - చిప్పగిరి

'మనం ఎక్కడ నివసిస్తున్నా పుట్టి పెరిగిన ఊరిపై ప్రతి ఒక్కరికీ మమకారం ఉంటుంది. సొంత గ్రామానికి ఎంత సహాయం చేసినా అది తక్కువే అవుతుంది' అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. మొహర్రం పండగ నేపథ్యంలో మంత్రి జయరామ్ స్వగ్రామం గుమ్మనూరులో మూడు రోజులు ఉన్నారు. మొహర్రం పండగను ప్రశాంతంగా నిర్వహించారు. గ్రామ పెద్దలంతా శివాలయం నిర్మాణం చేపడుతుండడంతో మంత్రి దృష్టికి తెచ్చారు. ఆదివారం ఆయన స్పందిస్తూ... సొంత గ్రామంపై ప్రతి ఒక్కరికీ మమకారం ఉంటుందని తెలిపారు. తనకు మాట చెబితే సహాయం చేస్తానని చెప్పారు. వెంటనే పెద్దలకు రూ.5 లక్షలను విరాళంగా అందజేశారు. మంత్రి మాట్లాడుతూ... భవిష్యత్తులో కూడా తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. గ్రామ ప్రజలందరూ పురాతన ఆచారాలు వీడకుండా మొహర్రం పండగను ప్రశాంతంగా జరుపుకున్నారని తెలిపారు. సొంత గ్రామంలో ప్రతి ఒక్కరూ అయిన వారే ఉంటారని, ఏ హోదాలో ఉన్నా ఏ ఒక్కరినీ మరువబోమని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి గడపకూ ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. రాబోయే 2024 ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలబడాలని ప్రజలను కోరారు. ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ నారాయణస్వామి, విక్రాంత్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అడ్డంగా ఉన్న ముళ్లకంప తొలగింపు

ప్రజాశక్తి - చిప్పగిరి

సర్పంచికి కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీవాసులు

మండలంలోని కుందన గుర్తి గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లే రహదారి అంతా ముళ్లకంపతో నిండి ఉంది. ఎస్సీ కాలనీవాసులు గుండాల లక్ష్మన్న, లాలప్ప, పెన్నయ్య, నారాయణ, కుషేంద్ర, రామాంజనేయులు విజ్ఞప్తి మేరకు ఆదివారం సర్పంచి కొండా పురుషోత్తం ఆధ్వర్యంలో జెసిబి ద్వారా రహదారికి అడ్డంగా ఉన్న ముళ్లకంప తొలగింపు కార్యక్రమం చేపట్టారు. సర్పంచి మాట్లాడుతూ... ఎవరైనా మృతి చెందినప్పుడు ఎస్సీల శ్మశాన వాటికకు మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఇబ్బంది పడేవారని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీల శ్మశాన వాటికకు కాలినడకన వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతుండడంతో వెంటనే స్పందించి పనులను చేయించామని చెప్పారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. సర్పంచికి ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. హేమాంజనేయులు, శ్రీనివాసులు, కొండా నెట్టెప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

మాట్లాడనీయపోవడం విడ్డూరం

- తెలుగు మహిళ కర్నూలు పార్లమెంట్ అధికార ప్రతినిధి నరవ శశిరేఖ

ప్రజాశక్తి -పెద్దకడుబూరు

సమావేశంలో మాట్లాడుతున్న శశిరేఖ

సర్వసభ్య సమావేశంలో తనను మాట్లాడనీయపోవడం విడ్డూరంగా ఉందని తెలుగు మహిళ కర్నూలు పార్లమెంట్ అధికార ప్రతినిధి నరవ శశిరేఖ తెలిపారు. ఆదివారం పెద్దకడబూరు ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్వసభ్య సమావేశంలో మండల ప్రతిపక్ష నాయకులుగా తాను మాట్లాడుతుండగా 'మాట్లాడడానికి హక్కు లేద'ంటూ వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రావడమే తప్పని, వచ్చినా ఇలా ఏదైనా మాట్లాడాలంటే సభాధ్యక్షురాలి హోదాలో మండల అధ్యక్షులు మాట్లాడాలని చెప్పారు. ఇలా సభ్యులు కాని వారు మాట్లాడడం రాజ్యాంగంలో లేదన్నారు. మరి వారు ఏ రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారో ఆలోచించాలని హితవు పలికారు.

టామో'రా'రెస్తోంది..!

- రికార్డు స్థాయికి చేరిన ధరలు
- కొనలేం.. తినలేం అంటున్న సామాన్యులు

ప్రజాశక్తి - హోళగుంద

టమోటా ధరలు రికార్డు స్థాయికి చేరి రూ.130 నుంచి రూ.150 పలుకుతోంది. కూరగాయల ధరలు సైతం పైపైకి చేరుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి వినియోగదారులు ధరలు ఇలా మండిపోతుంటే 'ఏం కొనలేం.. తినలేం' అంటూ ఆందోళన చెందుతున్నారు.

ప్రతేడాది మే నెలలో వర్షాలు కురువగా అక్కడక్కడ వంకాయ, టమోటా కూరగాయలను రైతులు పండించేవారు. ఈ ఏడాది వర్షాలు జులై నెలాఖరుకు వచ్చినా కొంతవరకు తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసినా ప్రయోజనం లేకపోయింది. బోరుబావుల కింద పండించడానికి సాగు భూములు తక్కువ ఉండడం, విద్యుత్ కోతలు ఉండడం వల్ల ఏ రైతూ కూరగాయలు పండించడానికి మొగ్గు చూపలేదు. ధరలు అమాంతం పెరిగి సామాన్యులకు భారంగా మారాయి. కిలో టమోటా రూ.150, బీరకాయ రూ.60, వంకాయ రూ.50, పచ్చిమిర్చి ఏకంగా రూ.100 దాటిపోయింది. ఆకుకూరల్లో కొత్తిమీర ఒక కట్ట రూ.20 పలుకుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతున్న దృశ్యం (ఫైల్)

పక్క రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్షాలు లేక కూరగాయలు పండించేందుకు రైతులు మొగ్గు చూపలేదు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవడం వల్ల, రవాణా చార్జీలు పెరిగి కూరగాయల ధరలు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మదనపల్లిలో కూడా పంట దిగుబడి చివరి స్థాయికి చేరుకోవడంతో తక్కువ మొత్తంలో టమోటాలు మార్కెట్‌కు వస్తుండడంతో ధరలు పెరగడానికి కారణమని తెలిసింది.

ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

కూరగాయల ధరలు నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందడంతో దళారులు కమీషన్లకు కక్కుర్తి పడడంతో ధరలు పెరుగుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఎంత రవాణా చార్జీలు పెరిగినా, ఎప్పుడూ ఇలా ధరలు పైపైకి పోవడం చూడలేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కూరగాయల ధరలను నియంత్రణలో ఉంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శాంతి నెలకొల్పడంలో ప్రభుత్వాలు విఫలం

- నేడు శాంతి మహా ప్రదర్శన
- క్రైస్తవ ఐక్యవేదిక నాయకులు పాస్టర్ ఆనంద్ రాజ్

ప్రజాశక్తి - ఆదోని

మణిపూర్ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని క్రైస్తవ ఐక్యవేదిక నాయకులు పాస్టర్ ఆనంద్ రాజ్, జాషువా, శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో మే 3న ప్రారంభమైన దమనకాండ ఇప్పటికీ చల్లారలేదని తెలిపారు. సుమారు 375కు పైగా చర్చిలను ధ్వంసం చేసి, వందలాది మందిని అతి కిరాతకంగా చంపినా, ఆస్తులను ధ్వంసం చేసినా అక్కడి ప్రభుత్వం నిందితులను అరెస్టు చేయడంలో విఫలం చెందిందని విమర్శించారు. ఈ ఘటనను ప్రపంచ దేశాల ప్రతినిధులు, ఐక్యరాజ్యసమితి ఖండించినా ప్రధాని మోడీ మౌనం వహించడం సమంజసం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు కూడా కనీసం ఖండన ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. ఇప్పటికైనా మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సోమవారం ఆదోని పట్టణంలోని మండగిరి బాల ఏసు చర్చి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు క్రైస్తవ, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అభ్యుదయవాదులు, లౌకికవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నాయకులు సునీల్ రాజ్ కుమార్, ఉరదయ్య, అమల్నాథన్, శాంతన్న, సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

హోటల్ రంగాన్ని చిన్న పరిశ్రమగా గుర్తించాలి

- హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరావు

ప్రజాశక్తి - ఆదోని

హోటళ్లను చిన్న తరహా పరిశ్రమలుగా గుర్తించి ప్రోత్సహించాలని హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సముద్రాల హనుమంతరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆదోని ద్వారక హోటల్‌లో హోటల్స్ అసోసియేషన్ ఆదోని తాలూకా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. సుచి, శుభ్రత పాటిస్తూ నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డిస్తే మంచి పేరు వస్తుందని తెలిపారు. ప్రస్తుత నేపథ్యంలో డబ్బులు పెట్టినా రుచికరమైన ఆహారం దొరకడం తక్కువేనని చెప్పారు. హోటల్ నిర్వహణ కత్తి మీద సాము లాంటిదన్నారు. పలు రకాల జనాలు వస్తూ, పోతూ ఉంటారని, వారందరినీ సంతృప్తి పరచాల్సి వస్తుందని తెలిపారు. రాత్రి 12 గంటల వరకు హోటల్ నిర్వహణ జరిగేలా సహకరించాలని పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. అనంతరం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరేష్ మాట్లాడారు. కరోనా సంక్షోభం నుంచి హోటళ్లు ఇంకా తేరుకోలేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో మరింత తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాల నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలుగా గుర్తించి రాయితీలు, ప్రోత్సాహకాలను ఇవ్వాలని కోరారు. ఈనెల రెండో వారంలో విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మంత్రులకు వినతి పత్రాలు అందించామన్నారు. రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచాలని ప్రభుత్వ అనుమతులు ఉన్నా కొందరు పోలీసులు 10.30 గంటలకే మూసివేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కస్టమర్లు భోజనం చేస్తున్న సమయంలో ఎలా మూసివేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. హోటల్స్ యజమానులు ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని పోలీసులకు చూపించాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆవకాయ హోటల్ యజమాని శ్రీనివాసులు మాట్లాడారు. హోటళ్లపై పదేపదే విజిలెన్స్ దాడులు చేయడం తగదన్నారు. తమ కస్టమర్లకు సుచి, శుభ్రతతో వడ్డిస్తున్నామని తెలిపారు. ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... హోటల్స్ యాజమాన్యాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీఇచ్చారు. చిన్న తరహా పరిశ్రమలుగా గుర్తించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నాయకులు కొండయ్య చౌదరి, ఆదోని అధ్యక్షులు బసవన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.వీరేష్, గౌరవ సలహాదారులు రేణుకాంబ రాజు స్వామి, విట్టా రమేష్, గుడిసె శివన్న, భీమ లింగప్ప, ప్రవీణ్, భారత్ గ్యాస్ యజమాని సందీప్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సోమశేఖర్, వీరేష్, చంద్రశేఖర్ రెడ్డి, గోపాల్, సద్దాం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

- డాక్టర్ ఆదిత్య కుమార్

ప్రజాశక్తి - ఆదోని

సీజనల్ వ్యాధులు దరిచేరకుండా పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతూ, జాగ్రత్తలు పాటించాలని ఆదిత్య నర్సింగ్ హోమ్ చైల్డ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆదిత్య కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా కొత్త, పాత నీరు కలవడం వల్ల ఆ నీరు తాగిన వారు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో వేడి చేసిన నీటినే తాగాలని సూచించారు. డెంగీ, మలేరియా, డయేరియా, అతిసార వ్యాధులు పిల్లలకు సోకే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమకాటు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల జ్వరం తీవ్రత తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి జారుకునే ప్రమాదం ఉందన్నారు. చిన్నపాటి జ్వరం వచ్చిన వెంటనే స్పెషలిస్టు వైద్యులను సంప్రదించి పిల్లలకు మెరుగైన వైద్యం చేయించాలని తెలిపారు. తమ ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉందన్నారు. టీకాలు, వాక్సినేషన్ సదుపాయం ఉందని తెలిపారు. క్రిటికల్ రోగాల బారిన పడిన రోగులకు తమ ఆస్పత్రిలో ఇసియు, వెంటిలేటర్ సౌకర్యం ఉందని వివరించారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి : రైతుసంఘం

ప్రజాశక్తి - దేవనకొండ

ఆదోని నుంచి కర్నూలు వరకు ఆగస్టు 2 నుంచి 7 వరకు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గతేడాది రైతులు సాగు చేసిన అన్ని పంటలకూ ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలిపారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని కోరారు. అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, రైతుల బ్యాంకు రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం సందర్భంగా ఆలూరు నియోజకవర్గం భక్తులే కాకుండా కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీమాల మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి పూజ కోసం భక్తులు బారులుదీరారు. అర్చకులు మల్లయ్య, మహేష్ స్వాములు మాల మల్లేశ్వరలకు అభిషేకం చేసి బండారు అర్చన, బిల్వార్చన, కుంకుమార్చన చేశారు. భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా హోళగుంద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తలుపులు పగులగొట్టిన దృశ్యం

పొలం రస్తా విషయంలో దాడి

- పాత కక్షలే కారణం..?

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని వలగొండ గ్రామంలో పొలం రస్తా విషయంలో కురువ సామాజిక వర్గం వారు దళితులపై దాడికి పాల్పడ్డారు. శనివారం పీర్ల సరిగెత్తు సందర్భంగా పీర్ల చావిడి ముందు అలాయి గుంత దగ్గర సావుసోన్ వేస్తుండగా తెల్లవారుజామున 2 గంటల సమయంలో దళితులపై దాడి చేశారు. దళితుల ఇళ్లకు వెళ్లి ఇంటి తలుపులు పగులగొట్టి, దిచక్ర వాహనాలను ధ్వంసం చేసి, మహిళలను బెదిరించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన 9 మందికి రక్త గాయాలు కాగా ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పుష్ప అనే మహిళ స్పృహ తప్పి పడిపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కురువ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురికి గాయాలు కాగా, వారిని కూడా ఆదోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆదివారం ఎస్ఐ వరప్రసాద్ మాట్లాడుతూ... గతంలో పొలం రస్తా విషయంపై ఇరువర్గాలు స్టేషన్‌కు రాగా ఇరువర్గాలకు నచ్చచెప్పినా వినకపోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పాత కక్షల కారణంగా ఆదివారం తెల్లవారుజామున ఇరు వర్గాలు గొడవ పడ్డారని చెప్పారు. ఇరువురిని ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- ఎంఆర్‌పిఎస్

వలగొండలో దళితులపై అమానుషంగా దాడి చేసిన వారిని కఠిన శిక్షించాలని, బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు నెట్టేకల్, మండల కార్యదర్శి సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళితులపై రాళ్లు, కర్రలతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దళితులకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

సారూ..! నడిచేదెలా....?

- అధ్వానంగా మారిన రోడ్డు

ప్రజాశక్తి - ఆదోని

భారీ వర్షాల కారణంగా రోడ్లు అధ్వానంగా మారాయి. వాహనాల రాకపోకలతో గుంతలమయంగా మారాయి. చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిలిచి ఉండడంతో బైకులు, వాహనాలు అదుపుతప్పి కింద పడ్డ సంఘటనలూ ఉన్నాయి. ఆదోని పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి రైల్వే గేట్ వరకు సాగే రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారింది. పట్టణంలోని రోడ్ల మధ్య డివైడర్లు ఏర్పాటు చేసి అందులో మొక్కలు పెంచి పచ్చదనం పెంపొందించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి డీఎస్పీ బంగ్లా వరకు రోడ్డు నిర్మించి డివైడర్ ఏర్పాటు చేయాలని పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఎల్ఎల్‌సి కార్యాలయం వరకు డివైడర్లు నిర్మించి అలాగే వదిలేశారు. పనుల కోసం తవ్వి రోడ్డు వదిలేయడం వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. ఏర్పడిన గుంతలు మరింత పెద్దవిగా మారి నీరు నిలిచింది. తెలియక నీళ్లలో దిగి కింద పడిన సందర్భాలూ ఉన్నాయని పలు వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్య ఇలా ఉందని వాపోతున్నారు. బిల్లుల మంజూరులో జాప్యం వల్ల కాంట్రాక్టర్ మధ్యలో పని వదిలేశారని తెలిసింది. గుంతలో కనీసం గ్రావెల్ వేయించినా రాకపోకలకు ఇబ్బంది ఉండదని పలువురు చెబుతున్నారు. ఈ రోడ్డు గుండానే వందలాది వాహనాలు ఎస్‌కెడి కాలనీ, శివశంకర్ నగర్, క్రాంతి నగర్, మహాత్మ గాంధీనగర్, క్రాంతినగర్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. డీఎస్పీ కార్యాలయానికి పనుల నిమిత్తం పోలీసులు కూడా నిత్యం వస్తుంటారు. సమీపంలోనే బాలికల ప్రభుత్వ పాఠశాల ఉండడం వల్ల విద్యార్థినులు కూడా అటువైపునే వస్తూ పోతుంటారు. బురదమయంగా మారడంతో కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గుంతలో నీరు నిలిచిన డీఎస్పీ బంగ్లా రోడ్డు

'పంటను దున్నేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పొట్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని 310/ఎ, 310/2 సర్వే నెంబర్‌లో 6.70 ఎకరాల విస్తీర్ణంలో 2 ఎకరాల్లో సాగు చేసిన కంది, సజ్జ పంటను నూర్జహాన్, అమ్రిన్ బాషలు దౌర్జన్యంగా దున్నేశారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెర్నేకల్ గ్రామానికి చెందిన ఉప్పర సరోజ కోరారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ సీలింగ్ పొలాన్ని సాగు చేసుకోకుండా తమకు చెందిన పొలంలోకి అక్రమంగా వచ్చి వేసిన పంటను ధ్వంసం చేయడమే కాక తనపై దాడికి ప్రయత్నించారని తెలిపారు. కంచె రాళ్లు, సాగు చేసిన పంటను తొలగించడంతో రూ.లక్ష దాకా నష్టం వాటిల్లిందని వాపోయారు. ఈ విషయంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. సంబంధిత అధికారులు కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

హింసను నివారించి శాంతి నెలకొల్పాలి

- ఎంబి ఎరుషలేం సంఘం కాపరి జయన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మణిపూర్ రాష్ట్రంలో హింసాకాండను నిరోధించి శాంతిని నెలకొల్పాలని ఎంబి ఎరుషలేం సంఘం కాపరి రేవ పి.జయన్న, సంఘం కార్యదర్శి కె.భాస్కర్ బాబు కోరారు. ఆదివారం ఎంబి ఎరుషలేం సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవ దేవాలయాలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నివారించి శాంతిని నెలకొల్పాలని కోరారు.

మాట్లాడుతున్న సిఎస్ఐ చర్చి సంఘం సత్యానందం భాస్కర్

మతోన్మాదులను ఉరి తీయాలి

- సిఎస్ఐ చర్చి సంఘం కాపరి సత్యానందం భాస్కర్

ప్రజాశక్తి-ఆలూరు

మణిపూర్‌లో కుకీ తెగ (క్రిస్టియన్లు) ప్రజల ప్రాణాలపై, మానాలపై, ఆవాసాలపై, ప్రార్థన మందిరాలపై హింసకు పాల్పడిన మతోన్మాదులను ఉరి తీయాలని సిఎస్ఐ చర్చి సంఘం కాపరి సత్యానందం భాస్కర్ కోరారు. ఆదివారం మండలంలోని మొలగవల్లి కొట్టాల గ్రామంలో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా సురేష్ బాబు, పత్తికొండ ప్రసాద్ అధ్యక్షతన దళిత, క్రైస్తవులు శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మణిపూర్‌లో 289 చర్చిల విధ్వంసాలకు పాల్పడడమే కాకుండా ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి మణిపూర్‌లో మంటలు ఆపాలని కోరారు. మణిపూర్ హింసకాండపై 'సిట్' ఏర్పాటు చేసి నిందితులను చట్టపరంగా శిక్షించాలని తెలిపారు. దళిత, గిరిజన, ముస్లిం, మైనార్టీ, క్రైస్తవులకు భద్రత కల్పించాలని కోరారు. సంఘం పెద్దలు దేవపుత్ర, ఆశీర్వాదం, ఆర్‌కె.బుజ్జి, దాసప్ప, ఆనంద్, ధర్మన్న, ఎస్.ఆంజనేయ, ఎస్.మల్లేష్, నేమకల్ బాబు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీమఠంలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం రాఘవేంద్రుని దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు చేసి, అనంతరం గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు శ్రీమఠం దివాన్ సుధీంద్రాచార్ విశేష పూజలు నిర్వహించారు. బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఉంచి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పల్లకి సేవ చేయించిన భక్తులతో ఘనంగా ఊరేగించారు.

శ్రీమఠంలో ఘనంగా ద్వాదశీ పూజలు

శ్రీమఠంలో ద్వాదశీ పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసీ అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూలరాములుకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు.

బాబు పథకం తల్లికి వందనం కాదు..

ప్రతి తల్లికి పంగనామం : వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబుసాబ్

ప్రజాశక్తి - కౌతాళం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలోని తల్లికి వందనం పథకం కాదని, ప్రతి తల్లికీ పంగనామం పెట్టే పథకమని వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబుసాబ్ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళల కోసం చంద్రబాబు ప్రవేశపెడతానని చెబుతున్నా తల్లికి వందనం పథకాన్ని ప్రతి తల్లికీ పంగనామమని నామకరణం చేస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి 600 అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అలాగే రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలు రుణాలు రద్దు చేస్తామని చెప్పి నట్టేట ముంచారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు అధికార దాహంతో ఆచరణకు వీలుకాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు. 'ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలకే రాష్ట్రం ఆర్థికంగా లో బడ్జెట్‌లో ఉంది. నవరత్నాల హామీలను ఎలా అమలు చేస్తారు' అని చంద్రబాబు విమర్శించారని తెలిపారు. నేడు అదే హామీలను, కర్ణాటక ప్రభుత్వం ప్రవేశపెట్టిన హామీలను కాపీ కొట్టి వాటికి పేర్లు మార్చి అమలు చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు మేనిఫెస్టో రూపొందించలేని అసమర్థతతో ఉన్నారని విమర్శించారు. జగన్ పథకాలు కొన్ని, కర్ణాటక పథకాలు కొన్ని, తమిళనాడు పథకాలు కొన్ని కలిపి మినీ మేనిఫెస్టోను ప్రకటించిన అసమర్థుడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అధికార దాహంతో ఎన్ని హామీలు ప్రకటించినా, అధికారం వచ్చిన తర్వాత ప్రజలకు పంగనామం పెడతారన్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన నవరత్న హామీలన్నింటినీ అమలు చేస్తున్న జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, వై.బాలనాగిరెడ్డిని నాలుగోసారి ఎమ్మెల్యేగా 2024 ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న బుజ్జి స్వామి, మాబుసాబ్

శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 846.70 అడుగులకు చేరింది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి నీటి ప్రవాహం కొంతమేరకు తగ్గుముఖం పట్టింది. ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదనతో మాత్రమే 41,252 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 1310 క్యూసెక్కులతో కలిపి 42,562 క్యూసెకుల నీరు వచ్చి జలాశయానికి చేరుతున్నాయి. అదే సమయానికి నీటి నిలువ సామర్థ్యం 73.2313 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు మాత్రమే 1600 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. విద్యుత్ ఉత్పాదన జరగడం లేదు.

'స్పందన' శూన్యం

- 12 సార్లు అర్జీ ఇచ్చినా పరిష్కారం కాని సమస్య
- అధికారులు స్పందించడం లేదని అర్జీదారులు అసహనం

అధికారులకు అందజేసిన అర్జీని చూపుతున్న బాధిత రైతు (ఫైల్)



అధికారులకు అందజేసి అర్జీలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఏదైనా సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే 30 రోజుల్లోపు పరిష్కారం చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం 'స్పందన' కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో అనేక మంది బాధితులు సోమవారం వచ్చిందంటే చాలు కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయం చేరుకుని వందల అర్జీలు అధికారులకు సమర్పించుకుంటుంటారు. అయితే అందులో ఎన్ని పరిష్కారమవుతున్నాయన్నది ప్రశ్నార్థకమే. సమస్యల పరిష్కారం కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆచరణలో బాధితుల కష్టాలు మాత్రం యధావిధిగా ఉంటున్నాయి. కార్యాలయాల చుట్టు తమ సమస్య పరిష్కారం కోసం బాధితులు తిరుగుతూనే ఉండాల్సిన పరిస్థితులు క్షేత్ర స్థాయిలో నెలకొన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొదట్లో ఈ కార్యక్రమం చురుగ్గా కనిపించినా రానురాను విమర్శలకు గురవుతుంది. నందికొట్కూరు నియోజకవర్గ కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినా ఎటువంటి స్పందన ఉండడం లేదని అర్జీదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదైనా పరిష్కారం లభించలేదని బాధితులు ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన రైతు బెస్త రాజు పొలం సమస్య పరిష్కారం కోసం ఇప్పటి వరకు 12 సార్లు స్పందనలో అర్జీలు అధికారులకు సమర్పించుకున్నాడు. కొణిదేల గ్రామానికి చెందిన గుంతా లక్ష్మీనారాయణ, జి.బాల నాగయ్యలు రైతుల దగ్గర అప్పులు చేసి ఐపి పెట్టారు. గ్రామ ప్రజల సమక్షంలో గుంతా లక్ష్మీనారాయణ వారసత్వ రీత్యా దస్తావేజు నెం. 425/1975 వారి పెద్దల నుండి సంక్రమించిన ఆస్తికి సంబంధించి 2019 ఫిబ్రవరి 16న కొణిదెల గ్రామ రచ్చకట్ట వద్ద గ్రామ పెద్దలు వేలంపాట నిర్వహించారు. ఆ వేలం పాటలో కొణిదెల గ్రామానికి చెందిన బెస్త మల్లేశ్వరి, భర్త బెస్త రాజు నాగటూరు గ్రామ పొలిమేరలో గల సర్వే నెం. 343/1 నందు 3.09 ఎకరాలు రూ. 9 లక్షల 15 వేలకు కొనుగోలు చేశారు. గోగుల లక్ష్మీదేవి, భర్త గోగుల నాగశేషులు నాగటూరు గ్రామ పొలిమేరలో గల సర్వే నెం. 343/1లో 3.09 సెంట్లను రూ.10 లక్షల 15 వేలకు కొనుగోలు చేశారు. వీరు ఇరువురు వేలంపాటలో కొనుగోలు చేసిన భూమిని కంప్యూటర్ అడంగల్‌లో వారి పిల్లల పేరు మీదుగా నమోదు చేయాలని, ఆలాగే ఆ భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు చేయాలని స్పందన కార్యక్రమంలో ఇప్పటి వరకు 12 సార్లు దరఖాస్తు చేసుకున్నారు. ఒకే సర్వేపై రెండు ఖాతాలు నమోదు కావడంతో వాటిని ఆన్‌లైన్ నుంచి తొలగించాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నా నేటికి సమస్య పరిష్కారం కాలేదని అర్జీదారుడు రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. స్పందన కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదుదారుల్లో అధిక శాతం మంది భూముల సమస్యలతోనే వస్తున్నారు. ఆర్థిక విషయాలతో సంబంధంలేని అంశాలను కూడా అధికారులు స్పందించి తీర్చకపోవడంపై బాధితులు ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని అర్జీదారులు కోరుతున్నారు.

టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

క్రిష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం క్రిష్ణగిరి మండల పరిధిలోని అమ్మకతాడు టోల్ ప్లాజా దగ్గర కార్మిక యూనియన్ అధ్యక్షులు అయ్యారాజు అధ్యక్షతన సిఐటియు జెండావిష్కరణ కార్యక్రమం జరిగింది. సిఐటియు జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు ఆవిష్కరించి మాట్లాడారు. అమకతాడు టోల్ ప్లాజాలో 10 సంవత్సరాలకు పైగా చాలీ చాలని వేతనాలతో కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. టిఎ, డిఎలు ఇవ్వాలన్నారు. గతంలో టిఫిన్, భోజన సౌకర్యాలు కల్పించేవారని, కరోనా నుండి వాటిని నిలిపివేశారని చెప్పారు. దానిని వెంటనే కొనసాగించాలని, డ్యూటీకి రావడానికి, పోవడానికి అయ్యే ప్రయాణ ఖర్చులు కంపెనీయే భరించాలని, సంవత్సరానికి ఒక నెల వేతనం బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనదారులతో ఎదురయ్యే ఇబ్బందులను కంపెనీయే పరిష్కరించాలని తెలిపారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం, డోన్ మండల కార్యదర్శి పి.రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు నక్కి శ్రీకాంత్, మండల, పట్టణ కోశాధికారులు బి.నాగమద్దయ్య, యు.శ్రీనివాసులు, ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ కోయిలకొండ నాగరాజు,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ఏ.చిన్న రెహమాన్, హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.నాగన్న, అమకతాడు టోల్ ప్లాజా ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి శ్రీనివాసులు, నాయకులు రమేష, రాముడు, మధు, నాగేంద్రుడు, వెంకటేష్, ఆర్‌కె.వి.రాజు, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు

నీటిలో మునిగిన ఆలయం

కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరాలయం

- సంగమేశ్వర ఆలయాన్ని చుట్టుముట్టిన నీరు

ప్రజాశక్తి - కొత్తపల్లి

గత కొన్ని నెలల నుంచి భక్తుల పూజలు అందుకుంటున్న సంగమేశ్వరుడు ఆదివారం కృష్ణమ్మ ఒడిలోకి మెల్లమెల్లగా చేరుకుంటున్నాడు. శ్రీశైలం జలాశయంకు భారీగా వరదనీరు చేరుతుండడంతో సంగమేశ్వర ఆలయం మునుగుతోంది. ప్రతి సంవత్సరం సుమారు 6 నెలల పాటు కృష్ణానది నీటిలో మునిగి ఉంటుంది సంగమేశ్వర ఆలయం. మరో 6 నెలల పాటు సంగమేశ్వర క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎగువ ఉన్న ఆలయంలో ఆలయ అర్చకులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో పలు విశేష పూజలు నిర్వహిస్తారు. వచ్చిన భక్తులు దారి వెంట నల్లమలలో ఉన్న పచ్చని చెట్లు, ప్రకృతి కనుచూపుమేరలో కృష్ణమ్మ పరవళ్ళు చూస్తూ కుటుంబ సమేతంగా ఆనందంగా గడుపుతారు. ఆదివారం సంగమేశ్వరాలయం ముఖ మండపం దగ్గరికి వరద జలాలు చేరుకున్నాయి.

మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - నంద్యాల

మణిపూర్‌లో మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకోటు వాసు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్ సంఘటనలను వ్యతిరేకిస్తూ ఆదివారం కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన సంఘటన భారతదేశ ప్రజలను, స్త్రీలను తీవ్రంగా కలిచివేసిందన్నారు. దీనిని కాంగ్రెస్ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మణిపూర్ ఘటనలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, అల్లర్లను ఆపాలని డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలోని అడవి ప్రాంతంలో ఎంతో విలువైన ఖనిజ సంపదను దోచుకోవడానికి పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి వెనక ఉండి రెండు కులాల మధ్య వైర్యాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. అటవీ ప్రాంతం మొత్తం ఖాళీ చేయించే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మీద విమర్శించిన వారిపై రకరకాల కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడానికి వాడుతున్న కేంద్ర ప్రభుత్వ సంస్థలను మణిపూర్‌కు ఎందుకు పంపించడం లేదని ప్రశ్నించారు. అక్కడ జరుగుతున్న సంఘటనలను నియంత్రించడానికి సైన్యాన్ని ఎందుకు ఉపయోగించడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, సీనియర్ మైనార్టీ నాయకులు చాబోలి సలాం, ఐయుఎంఐ జిల్లా అధ్యక్షులు మౌలానా, కరిముల్లా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : మణిపూర్ మరణకాండకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని జమాఅతే ఇస్లామి హింద్ మండల అధ్యక్షులు మీర్జా అలీ బేగ్, ఫాదర్ రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఖాన్ రైస్ మిల్లు నుండి పెట్రోల్ బంక్ కూడలి వరకు జమాఅతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మణిపూర్ మారణకాండకు వ్యతిరేకంగా ముస్లిం, క్రైస్తవ సంఘాలు, మహిళలు మానవతా ర్యాలీ నిర్వహించారు. పెట్రోల్ బంకు కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జాతుల మధ్య, కులాల మీద రాజకీయాల కోసం ఘర్షణలు పెట్టారని విమర్శించారు. మహిళలను నగ్నంగా ఊరేగింపు నిర్వహించి, అత్యాచారం చేస్తున్నా అక్కడి పాలక పార్టీలు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఆల్బర్ట్, పాస్టర్ మనోజ్, ఐవైఎం, ఎస్ఐఓ, ఎంపీజే, డబ్ల్యుపిఐ ఆర్గనైజేషన్లు, ముస్లిం క్రిస్టియన్ మహిళలు పాల్గొన్నారు.

నంద్యాలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మణిపూర్ హింసకాండ అరికట్టాలని ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, ముస్లిం మహిళలు

రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

ఆదమరిస్తే అంతే..

- గుంతను తవ్వారు.. పూడ్చడం మరిచారు..
- రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన వైనం..

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఆస్థానం రోడ్డులో కేడీసీసీ బ్యాంకు సమీపంలో గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డు పక్కన గుంతను తవ్వి పూడ్చడం మర్చిపోయారు. నెలలు గడుస్తున్నా అధికారులు గుంతను పూడ్చకపోవడంతో రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఆదమరిస్తే గుంతలో పడే ప్రమాదం ఉంది. పట్టణ రద్దీ ప్రాంతంలో రోడ్డు పక్కన గ్రామ పంచాయతీ అధికారులు గుంతను తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట వాహనదారులు, ప్రజలు, చిన్నారులు, వృద్ధులు గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గంలోని దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామంలో చర్చి నిర్మాణానికి మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ అనుచరులు పైడెల వెంకట సుబ్బారెడ్డి తనయుడు పైడెల మస్తాన్ రెడ్డి, పైడెల అంకిరెడ్డి తనయుడు పైడెల హేమ పవన్‌లు కలిసి 3 లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. అలాగే ఆదివారం చర్చి ప్రారంభ కార్యక్రమం కోసం రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో చెవ్వ శివ రెడ్డి, చెవ్వా అమర్ రెడ్డిలు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు స్పందన కార్యక్రమానికి ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

5న బహిరంగ సభను జయప్రదం చేయండి : ఐద్వా

ప్రజాశక్తి - నంద్యాల

హింసపై మహిళల పోరుయాత్ర కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 5న నంద్యాల జిల్లాకేంద్రంలోని గాంధీ చౌక్‌లో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి.నిర్మల కోరారు. ఆదివారం నంద్యాలలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) కార్యాలయంలో హింసపై మహిళల పోరుయాత్ర గోడ పత్రికలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హింసపై మహిళల పోరుయాత్రలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 28న చేపట్టిన బస్సు యాత్ర ఆగస్టు 8 వరకు కొనసాగుతుందని తెలిపారు. మహిళలపై హింసకాండ, మద్య నిషేధం, గంజాయి లాంటివన్నీ నిషేధించాలని డిమాండ్ చేశారు. మహిళలపై తరచూ హింసకాండ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలను పరిపాలించలేకపోతే ఎందుకని ప్రశ్నించారు. మహిళలపై నేరాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ నెల 28న ప్రారంభమైన బస్సు యాత్ర విశాఖపట్నం నుంచి ఒకటి, మరొకటి హిందూపురం నుంచి బయలుదేరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త కొత్త చట్టాలను తీసుకొచ్చినా నేరాలు మాత్రం యధావిధిగా జరుగుతూనే ఉన్నాయని అన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని, మహిళల చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 5న గాంధీ చౌక్‌లో జరిగే భారీ బహిరంగ సభకు పట్టణంలోని మహిళలందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు భాను, లక్ష్మి, మధుప్రియ, సుభద్ర, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు విడుదల చేస్తున్న టి.నిర్మల తదితరులు

శివానందరెడ్డీ.. నీ అంతు చూస్తాం

- తెలంగాణాలో పేదల ఆస్తులు కబ్జా - సొంత నిధులతో మిడ్తూర్‌లో ప్రాజెక్టు నిర్మించే దమ్ముందా..?
- రాయలసీమ ప్రాజెక్టును అడ్డుకోవడమే చంద్రబాబు నైజం : మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

ప్రజాశక్తి - కొత్తపల్లి

తెలంగాణ రాష్ట్రంలో పేదలు, దళితుల ఆస్తులను కబ్జా చేసిన టిడిపి నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు మాండ్ర శివానందరెడ్డి అంతు చూస్తామని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. రాయలసీమ ప్రాజెక్టును అడ్డుకోవడమే టిడిపి అధినేత చంద్రబాబు నైజమని మండిపడ్డారు. ఆదివారం కొత్తపల్లి మండలం శివపురం గ్రామ శివారులో వెలసిన కొలనుభారతి క్షేత్రాన్ని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పురోహితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో పలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న సప్త శివాలయాలను, చారు గోషిని నదిని సందర్శించారు. అనంతరం ఆర్యవైశ్య సత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పేదల ఆస్తులను ఆక్రమించుకొని నందికొట్కూరు నియోజకవర్గం మిడుతూరులో సొంత నిధులతో ప్రాజెక్టు నిర్మిస్తానన్న మాండ్ర శివానందరెడ్డికి దమ్ముంటే పనులు ప్రారంభించాలని, ప్రాజెక్టుకు కావాల్సిన పర్మిషన్ ముఖ్యమంత్రి నుంచి తాను ఇప్పిస్తానని సవాల్ చేశారు. 'టిడిపి ప్రభుత్వంలో నీరు-చెట్టు పనుల్లో అవినీతి చేసి కోట్లు సంపాదించిన ఘనత నీది కాదా' అని ప్రశ్నించారు. పనులు చేయడమంటే మాటలు చెప్పినంత సులువు కాదన్నారు. పేదల ఆస్తులను ఆక్రమించుకోవడంలో మాండ్ర శివానందరెడ్డికి సాటి ఎవరూ లేరని ఎద్దేవా చేశారు. గత టిడిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలో ఒక్క ప్రాజెక్ట్ అయినా చేశారా అని ప్రశ్నించారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి 95 శాతం పనులు పూర్తి చేయడంతో టిడిపి ప్రభుత్వంలో ఐదు శాతం చేసి పూర్తి చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల సందర్శనకు రావడాన్ని ప్రజలే అడ్డుకుంటారని తెలిపారు. రాయలసీమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చిన ఘనత చంద్రబాబుది అన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ఓట్ల కోసమే ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం చేపడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడుకు, శివానందరెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే నందికొట్కూరు పటేల్ సెంటర్లో నీటి ముంపు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తామని బహిరంగ ప్రకటన చేయాలని సవాల్ చేశారు. నాడు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సుమారు 1650 నీటి ముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పించానని తెలిపారు. పెండింగ్లో ఉన్న 1200 ఉద్యోగాలను ఇస్తామని పటేల్ సెంటర్లో బహిరంగ ప్రకటన చేసే దమ్ము మీకుందా అని సవాల్ విసిరారు. కొలను భారతి అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండి జగన్మోహన్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆశీర్వాదం ఉంటే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, ఎంపిటిసి శివన్న, సర్పంచి బాల ఎల్లయ్య, మాజీ వైస్ ఎంపిపి మహబూబ్ బాషా, మండల కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ గౌస్, నాగంపల్లి సొసైటీ మెంబర్ అచ్చిరెడ్డి, నాయకులు మహబూబ్ బాషా, శీను యాదవ్, నారాయణరెడ్డి, మున్నా, నాగలక్ష్మి రెడ్డి, నాగ ఎల్లయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లబ్బి వెంకటస్వామి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలం లింగంబోడు గ్రామానికి చెందిన తలారి కమలాకర్ (27) ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తలారి కమలాకర్ జెసిబి ఆపరేటర్‌గా పని చేసేవాడు. పనిలో నిమిత్తం జెసిబి వద్దకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా బనగానపల్లె నుంచి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో తలారి కమలాకర్ కిందపడి తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేంద్ర తెలిపారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆగస్టు మూడో వారంలో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు మాదిగలు భారీ ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మాదిగల ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మాదిగల ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆళ్లగడ్డ తాలూకా కార్యకర్తల సమావేశం ఎంఈఎఫ్ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఘన మద్దిలేటిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాదిగల ఎంప్లాయిస్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగ శేషు మాదిగ.ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు మాదిగలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా నాయకులు సంజీవ రాయుడు మాదిగ, ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాప్రాకార నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి దేవాలయంలో నిర్మిస్తున్న మహాప్రాకారం నిర్మాణానికి బెంగుళూరుకు చెందిన శ్రీనివాస్, కల్యాణి దంపతులు 1 లక్ష రూపాయలు విరాళంగా ఆదివారం ఇఒ రామకృష్ణకు అందజేశారు. ముందుగా దాతలు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వారు విరాళాన్ని అందజేశారు. దాతలను దేవస్థానం ఇఒ రామకృష్ణ, సిబ్బంది సుబ్బారెడ్డి ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇఒ మాట్లాడుతూ శనివారం కూడా నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి ఆలయ ప్రాకార నిర్మాణానికి లక్ష రూపాయలు అందజేశారని తెలిపారు. దాతలు సహకరించి ముందుకు వస్తే నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కాంట్రాక్టర్ నటరాజన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఒకు చెక్కు అందజేస్తున్న దాతలు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కడప ఉక్కు కోసం ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - బేతంచెర్ల

కడప ఉక్కుకై ఈనెల 31వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు వైబి వెంకటేశ్వర్లు, ఆర్ ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలో కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్న విభజన హామీని బిజెపి తుంగలోకి తొక్కిందని, పార్లమెంట్లో ఇటీవల చేసిన ప్రకటనతో స్పష్టమైందని వారు విమర్శించారు. ఉక్కు పరిశ్రమపై అధ్యయనం చేస్తున్నామని ఇటీవల ప్రకటించిన కేంద్రం, ఉక్కు పరిశ్రమ ఇక్కడ అనువు కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థకే సాధ్యం కానప్పుడు ప్రయివేట్ సంస్థ ఇక్కడ ఏరకంగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తుందని చెప్పాలని ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఈ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు నాలుగు సార్లు శంకుస్థాపనలు జరిగాయని గుర్తుచేశారు. కేవలం శంకుస్థాపనకేపరిమితమైందని ఎద్దేవా చేశారు. ఇంత జరుగుతున్న అధికార వైసీపీ నోరు మెదపడం లేదని వారు విమర్శించారు. పైగా ఆ పార్టీకి అవసరమైన మద్దతును అందిస్తున్నా ఉందని వారు తెలిపారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వకపోయినా, ప్రత్యేక హెూదా లేక పోయినా,విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేస్తున్న కేంద్రంలోని బిజెపిని పల్లెత్తి మాట కూడా అనకపోవడం చాలా దుర్మార్గము అని అన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసీపీ,టిడిపి,జనసేన పార్టీల తీరును నిరసిస్తూ ఈనెల 31వ తేదీన జరుగు నంద్యాల జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయడానికి ప్రజలు నిరుద్యోగులు కలిసి రావాలని వారు కోరారు.

ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలి : వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

జగనన్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ అన్నారు. ఆదివారం నాడు వ్యకాసం నాయకులు మండలంలోని పారుమంచాల మజార గ్రామమైన కొత్త సిద్దేశ్వరంను సందర్శించి, వారి స్థితి గతులు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్వంకో ల్పోయి గత 30 సంవత్సరాల నుంచి కొత్త సిద్దేశ్వరం గ్రామాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని ఇప్పటికీ ఈ పాలక ప్రభుత్వాలు గ్రామస్తులను ఆదుకోకపోవడంతో గుడిసెల్లోనే నివసిస్తున్నారని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో కొంతమంది లబ్దిదారులకు బేస్ మట్టం వేసుకోండి బిల్లులు మంజూరు చేయిస్తామని చెప్పిన ప్రభుత్వ అధికారులు బేస్ మట్టం వేసిన తరువాత ఇంతవరకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఉన్న గుడిసెలను ఊడబికి అప్పులు చేసి బేస్ మట్టం నిర్మించుకున్నారని అన్నారు. లబ్ధిదారులకు వెంటనే బిల్లులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయుడు, లక్ష్మీదేవి, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

మణిపూర్ ఘటన
దేశ ప్రతిష్టకు మచ్చ

ప్రజాశక్తి - నంద్యాల

మణిపూర్ రాష్ట్రంలో జాతుల ప్రబలుతున్న అరాచకత్వం, అత్యాచారాలు, గృహ దహనాలు జుగుప్సాకరమైన నేరాలు భారతజాతిని కలవరపెడుతున్నాయని, దేశ ప్రతిష్టకు మచ్చ అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం 'మణిపూర్ ఘటనలు - వైషమ్యాల నివారణ' అనే అంశంపై సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ హోమ్‌లో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మణిపూర్ మంటలలో ఇప్పటివరకు 150 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాదిమంది నిరాశ్రయులయ్యారని అన్నారు. మహిళలు, లైంగిక వేధింపులు తదితర ఘటనలు సభ్య సమాజానికి తలవొంపులు తెస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చర్చా కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు చింతల మోహన్ రావు, మస్తాన్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గోపాల్, నిరంకారమాచారి, అన్నెం శ్రీనివాస రెడ్డి, శేషఫణి, మాబు బాష, మద్దిలేటి, రామసుబ్బయ్య ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు డివి సుబ్బయ్య, రఫీ,జన విజ్ఞాన వేదిక సంస్థ నాయకులు రామరాజు, గురుస్వామి, చిన్నయ్య, ఖాజా హుస్సేన్ డాక్టర్ నాగరాజు న్యాయవాదివునీత, దళిత సంఘం నాయకులు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. మణిపూర్‌లో వైషమ్యాల నివారణకు పరస్పర విశ్వాసాన్ని పెంపొందించి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పే ఒదుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రమాదకర సంక్షోభాన్ని నివారించాలని చర్చా వేదికలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈశాన్య భారతంలో శాంతి పవనాలు వీచే దిశగా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మణిపూర్‌లో మారణకాండ: జెవివి

జనవిజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా సమావేశము ఆదివారం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగరాజు అధ్యక్షత భగత్ సింగ్ లైబ్రరీ నందు జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు టి. నాగరాజు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన హత్యాకాండ స్త్రీల పై దుశ్చర్యలు రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఖండించారు. నంద్యాల పట్టణ ట్రెజరర్ చిన్నయ్య మాట్లాడుతూ మణిపూర్ దుర్ఘటనను సంక్షిప్తంగా వివరిస్తూ మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలను నిరసించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గోపాల్, జెవివి నాయకులు రామరాజు, గురుస్వామి,నాగేంద్ర బాబు, పునీత్,ఖాజా తదితరులు పాల్గొన్నారు.

చర్చా వేదికలో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు టి. నాగరాజు

ఆత్మకూరులో శాంతిర్యాలీ

ఆత్మకూరు: మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ క్రైస్తవ దళిత, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఆత్మకూరు పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డ్ నుండి గౌరీ సెంటర్ పాత బస్టాండ్ వరకు భారీ ఎత్తున ప్రజలు పాల్గొని శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న గిరిజనులపై దాడులను ఖండిస్తున్నామని అన్నారు. నిందితులను వెంటనే శిక్షించాలని పేర్కొన్నారు. గిరిజనులకు వెంటనే రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నందు ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంఎస్పి నాయకులు చిలక రాబిన్సన్ బాసిపోగుల దరగయ్య, నాగశేషులు మాలమహానాడు నాయకులు మల్లయ్య, ఆర్ వై ఎస్ నాయకులు శీలం శేషు, ఆల్ డినామినేషన్ ఆడినామినేషన్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు రమేష్ జయరాజు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

క్యూ లైన్‌లో భక్తులు

శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం నాడు క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తుల రద్దీ బాగా పెరిగింది. నల్లమ శనివారము, ఆదివారం భక్తులు స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండి కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకొని స్వామి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. తెల్లవారుజామున 4-30 గంటల నుండి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర, క్యూలైన్లలో భక్తులు వేచి ఉండి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. స్వామి అమ్మవారిని దర్శించు కునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారుజాము 4.30 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిని ఇవ్వడం జరిగింది. భక్తులు అడిగిన అన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందు బాటులో ఉండడం జరిగిందని దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలతోటి చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతోందని దేవ స్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్నటువంటి కమ్యూనిటీ సత్రాలు భక్తులతో నిండిపోగా.. దేవస్థానం గదులు, కాటేజీలు, కమ్యూనిటీ సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి.

గ్రామ దేవతకు బోనాలు సమర్పణ

మూల నక్షత్రము సందర్భంగా శ్రీశైలం గ్రామ దేవత అంకాలమ్మకు ఆదివారం నాడు బోనాలు సమర్పించారు. లోకకళ్యాణం కోసం నిర్వ హించే పూజలలో భాగంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజలలో భాగంగా కార్యనిర్వహణ అధికారి లవన్న, ఉప కార్యనిర్వహణ అధికారి మోహన్, ఉబయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు పాల్గొని సంప్రదాయం ప్రకారం పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, పూలు, నివేదనతో అంకాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. వేదమంత్రాల మధ్య భోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒ మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం నిర్వహించే పూజలలో ప్రతి సంవత్సరం అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు.

బోనాలు తీసుకొస్తున్న ఇఒ లవన్న, తదితరులు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి -ప్యాపిలి

అనారోగ్యంతో మరణించిన మృతుడి కుటుంబానికి వాల్మీకి సోదరులు ఆదివారం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్యాపిలి పట్టణంలోని హుస్సేనాపురం గేరిలోని మెడ గట్టి రాజశేఖర్ (26) అనారోగ్యంతో శనివారం మరణిం చాడు. మృతునికి భార్య మాధవి, 9నెలల పాప ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న వాల్మీకి సోదరులు

జవాబుదారీగా పని చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ప్రజలకు జవాబుధారీగా పోలీసులు పని చేయాలని జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి 8 గంటలకు బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిసరాలను స్టేషన్లో ఉన్న వసతులను పరిశీలించి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు జవాబుదారితనంగా పనిచేయాలని సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించాలని స్టేషన్కు వచ్చే బాధితులను మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. ఆవరణలో అపరిశుభ్రంగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామంలో శాంతిభద్రత లు పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని అసాంఘిక కార్యకలాపాల పైన ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా కఠినంగా వ్యవహరించాలని పేకాట జూదం మట్కా గుట్కా నాటు సారా తయారీదారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాలూకా సిఐ రవీంద్ర, ఎస్ఐ మల్లికార్జున, ఎస్ఐ అక్బర్, ఎస్‌పిసిసి నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు పికెట్‌ను ఎస్‌పి తనిఖీ

గడివేములు: గడివేముల మండలం లోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయిలో ఆదివారం నాడు ఫ్యాక్షన్ పికెట్‌ను జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పికెట్‌లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఫ్యాక్షన్ ఇళ్ళ వద్ద ఉన్న పికెట్‌ను తనిఖీ చేశారు. గ్రామాలలో ఏ టువంటిసంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు, ఫ్యాక్షన్ కదిలికలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకో రావాలని, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం గడివేముల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల పిఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

సౌమ్య గిఫ్ట్ షోరూం ప్రారంభించిన ఎంపీ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని టిటిడి రోడ్ (రాజ్ టాకీస్ జంక్షన్ సమీపంలో)లో అధునాతన గిఫ్ట్ ఆర్టికల్స్‌తో ఏర్పాటు చేసిన సౌమ్య గిఫ్ట్స్ షోరూమ్‌ను నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నంద్యాల పట్టణంలో లేటెస్ట్ వెరైటీలతో కూడిన గిఫ్ట్స్ షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాణ్యతతో కూడిన గిఫ్ట్ ఆర్టికల్స్ పట్టణ ప్రజలకు అందు బాటులో ఉంచాలని ఎంపీ నిర్వాహకులకు సూచించారు. షోరూం ప్రొప్రైటర్స్ సంతోష్ రెడ్డి, విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ వద్ద గిఫ్ట్ ఆర్టికల్స్, సాఫ్ట్ టాయ్స్, ఐడికార్డ్స్, ఫోటో ఫ్రేమ్స్ సరసమైన ధరలకు లభిస్తాయన్నారు. శుభ కార్యక్రమాలకు ఆర్డర్లపై టీ షర్టు ప్రింటింగ్ ,మగ్ ప్రింటింగ్ ఉడ్ ప్రింటింగ్ లతో పాటు ఎల్ఈడి ఫ్రేమ్ ఆర్టికల్స్ కస్టమర్ల అభిరుచుల మేరకు డిజైనింగ్ చేసి అందిస్తామన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనిధి రఘువీర్, దండు వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, అన్నెం శ్రీనివాసరెడ్డి ఎంఈఓ రామ సుబ్బయ్య,రోటరీ పాఠశాల కరస్పాండెంట్ డివి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

షోరూమ్ ప్రారంభిస్తున్న ఎంపి పోచా

ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్‌గా మేసా ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల పట్టణంలో వెలసిన ఆరోగ్య మతా పుణ్యక్షేత్రం డైరెక్టర్‌గా గురుశ్రీ ప్రసన్నకుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురు శ్రీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దేవుని ప్రేమలో, ఆధ్యాత్మికంగా నడిపించడానికి కృషి చేస్తానన్నారు. దేశ ప్రజలందరూ క్రీస్తు యేసు ప్రేమలో తరించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తదనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సేవలు అందించిన గురు శ్రీ జాన్ దేవదాస్ చేసిన సేవ కార్యక్రమ కొనియాడారు. బదిలీపై అమెరికా దేశానికి వెళుతున్న గురు శ్రీ జాన్ దేవదాస్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మత పుణ్యక్షేత్రం కమిటీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న కుమార్ ను సన్మానం చేస్తున్న కమిటీ పెద్దలు

బహుజనులకు రాజ్యాధికారం రావాలి

ప్రజాశక్తి - పాములపాడు

బహుజనులకు రాజ్యాధికారం రావాలని బహుజన జేఏసీ గౌరవాధ్యక్షులు డాక్టర్ నాగన్న అన్నారు. ఆదివారం పాములపాడులోని పూలే-అంబేద్కర్ గ్రంథాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగన్న మాట్లాడుతూ బహుజనులందరూ ఐక్యమత్యంతో పోరాడితే రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆయన అన్నారు. దేశంలోని జనాభాలో నూటికి 85 శాతం బహుజనులు ఉండి కూడా అగ్రవర్ణాల చేతిలో బానిసత్వం అనుభవిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, పెరియార్ రామస్వామి వంటి మహనుభావుల ఆశయ సాధన కోసం మనమందరం పోరాడాలన్నారు. రాయలసీమ అభివృద్ధికి పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి బత్తుల సంజీవ రాయుడు, బీసీ ఐక్య సంఘం అధ్యక్షుడు గట్టు. శంకర్ గౌడ్, సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు యస్. షర్ఫుద్దీన్ అలి, బహుజన జేఏసీ నాయకులు కేఎం. శ్రీనివాసులు, కే బానకచర్ల ఉపసర్పంచ్ బి.నరసిం హులు, ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు ఎస్.మహబూబ్ బాషా, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు ఎన్.అబ్రహం, రజక సంఘం మండల అధ్యక్షుడు వి. రామకష్ణుడు, శ్రీశైలం నియోజకవర్గం బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు పల్లె.చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఈ. రాజు, బి ఎస్ పి పార్టీ నాయకులు బి.నరేష్, మాల మహానాడు నాయకులు ఎం.ఎలిసా, పి.రమేష్, లాయర్ పి. భాస్కర్, టీచర్స్ యూనియన్ నాయకులు పి.సన్వర్ ఖాన్, ఎం.జనార్దన్ రావు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కాంచనం. వేణుగోపాల్,డి.పెద్ద నాగరాజు, ఎం వికాస్ రాజ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్రంలో వైసిపి పాలనతో అభివృద్ధి శూన్యం డోన్ టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం బేతంచెర్ల నగర పంచాయతీ 6వార్డు నందు పోలూరు బ్రదర్స్ (పోలూరు వెంకటేశ్వర రెడ్డి, పోలూరు రాఘవరెడ్డి) అధ్యక్షతన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని అని అన్నారు. అనంతరం ఆరవ వార్డులో ఇంటింటికి తిరిగి టిడిపి మినిమేనిఫేస్టోను, తెలుగుదేశం పార్టీ హామీలుగా ఇస్తున్న పథకాలను వివరించారు. స్త్రీలను మహా శక్తిగా తీర్చిదిద్దడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అన్నారు. మండల కన్వీనర్ ఉన్నం, ఎల్ల నాగయ్య పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్తూ తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డోన్ నియోజ కవర్గం గౌరవ సలహాదారుడు తిరుమలేష్ చౌదరి, డోన్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రమల నాయుడు, రాష్ట్ర ముస్లిం నాయకులు జాకిర్ల బేగ్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రూబెన్, కౌన్సిలర్స్ పోలూరు ఆదిలక్ష్మి, రామాంజనేయులు, రామ్ గోపాల్, రామ్మూర్తి, నియోజకవర్గ వాణిజ్య కమిటీ అధ్యక్షుడు రేగటి భీమారెడ్డి, ఉపాధ్యక్షుడు జావాజి వెంకటేశ్వర్లు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు టైలర్ రాముడు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోకేష్ గౌడ్, పట్టణ ఐటీడీపీ అధ్యక్షుడు అరుణ్ కుమార్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫయాజ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముల్లా, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, నారాయణ స్వామి, యోగేంద్ర బాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాముడు పట్టణ అధ్యక్షుడు గూటం శివ, ఆవుల రామకృష్ణ, చింతకాయల విజయ్ కుమార్, వాసు సిద్ధిక్, జగదీష్, జనార్ధన్, కానాల అంజి, రామవరం శివ, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను వివరిస్తున్న ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

లింగాలలో రేపు సరిగెత్తు

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని లింగాల గ్రామంలో కడప బాదర్ల స్వామి సరిగెత్తు ఆదివారం, మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. కడప బాదర్ల స్వామి సరిగెత్తుకు ఏపీ, తెలంగాణల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను తీర్చుకుంటారన్నారు. లింగాల గ్రామంలో ఒక్క ముస్లిం కుటుంబం లేనప్పటికీ వివిధ మతాలకు చెందిన గ్రామస్తులు ఐక్యమత్యంతో ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చి ఈ సరిగెత్తులో పాల్గొని మొక్కలు తీసుకుంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి జిల్లా స్థాయి సమావేశం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని భారత్ కాంప్లెక్స్ నందు ఆదివారం అఖిలభారత వడ్డె ఓబన్న సేవా సమితి జిల్లా స్థాయి సమావేశం వ్యవస్థాపక అధ్యక్షులు మంజుల బాల నరసింహుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవస్థాప వ్యవస్థాపక అధ్యక్షులు మంజుల బాల నరసింహుడు జిల్లాలో ఓబన్న సేవా సమితి ద్వారా మున్ముందు చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. నంద్యాల జిల్లా అధ్యక్షులు బీవీన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి మన కమ్యూనిటీ సేవ చేసి ఐకాన్ వడ్డే ఓబన్న పేరును సమాజంలోనికి తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టీం రామకృష్ణ, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సంపంగి శివకృష్ణ, ఆర్గనైజేషన్ సెక్రటరీ మల్లికార్జున, నందికొట్కూరు నియోజకవర్గం అధ్యక్షులు శివమణి, టౌన్ ప్రెసిడెంట్ కేతన సురేష్, మల్యాల మధు, తిక్కస్వామి, ఆత్మకూరు జి రాజు, నాగరాజు, మల్లికార్జున, పల్లపు మౌలాలి పాల్గొన్నారు.

కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

2న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆగస్టు రెండవ తేదీన కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి జయంతిని పురస్కరిం చుకొని ఆగస్టు రెండవ తేదీన పట్టణంలోని అవుకు రోడ్డులో ఉన్న నాగార్జున రెడ్డి ఘాటు వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు

ఆర్‌టిసి కండక్టర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఆర్‌టిసి కండక్టర్ కుటుంబానికి బేతంచెర్ల ఆర్‌టిసి డిపో మేనేజర్ ఆర్థిక సాయం అందజేశారు. బనగానపల్లి ఆర్‌టిసి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బేతంచెర్ల పట్టణవాసి ముళ్ళ నూర్ అహ్మద్ శనివారం రాత్రి అకస్మాత్తుగా చాతిలో నొప్పి రావడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బనగానపల్లి ఆర్‌టిసి డిపో మేనేజర్ రవి కిషోర్ నూర్ బేతంచెర్లలో అహ్మద్ భౌతిక కాయానికి నివాళు లర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. దహన సంస్కారాలకై రూ.15000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. డిపో మేనేజర్‌తోపాటు ప్రసాద్ రెడ్డి, సిఆర్ పుల్లయ్య, సి.ఎన్. ఆర్.డి.ఎం బాష, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న డిపో మేనేజర్

గిరిజనులను దెబ్బతీసేందుకు బిజెపి కుట్ర

ఎపి గిరిజన ప్రజా సమాఖ్య

ప్రజాశక్తి - గడివేముల

దేశంలో గిరిజనులకు దెబ్బతీసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రమైన గడివేములలో విలేక రులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అడవులపై హక్కు లేకుండా చేస్తోందన్నారు. ఆదాని వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు అటవీ సంరక్షణ చట్టానికి సవరణ చేస్తోందని విమర్శించారు. అదేవిధంగా పాడేరు వైద్య కళాశాలలో 75 సీట్లు నిరుపేద మైదాన ప్రాంత గిరిజనులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, గిరిజనులకు అన్ని సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. గిరిజన తండాల్లో, చెంచుగూడాల్లో ఇరుకుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఏఐటియుసి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ పిలుపుమేరకు స్ట్రగుల్ కమిటీ కన్వీనర్ టి కళ్యాణ్ చక్రవర్తి అధ్యక్షతన ఆదివారం నాడు నంద్యాల జిల్లా స్థానిక ఎఐటియుసి కార్యాలయం నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఐటియుసి నాయకులు శ్రీనివాసులు, రఘురాం మూర్తి, సిఐటియు నాయకులు బాల వెంకట్, నంద్యాల జిల్లా టిడిపి నాయకులు జి శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నుండి చింతలయ్య, ఎఐటియుసి అనుబంధ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, సిహెచ్ సుధాకర్, ఐఎఫ్టియు నాయకులు చౌడప్ప, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ట్రగుల్ కమిటీ చేస్తున్న ఆందోళనకు సంబం ధించిన కమిటీ తీసుకున్న నిర్ణయాలు అందరికీ తెలియజేశారు. ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 24 వేల పైచిలుకు కార్మికు లను విద్యుత్ శాఖలో విలీనం చేస్తూ వారి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులు నిర్వహిస్తున్న ఆందోళ నకు వారు సంఘీభావాన్ని తెలియజేశారు. విద్యుత్ ఉద్యోగుల సమ్మెకు సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు.

ముత్యాలపాడులో

వైభవంగా మొహర్రం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామంలో ఆదివారం మొహర్రం వేడుకలు వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన లాల్ స్వామి పగటి ఊరేగింపు కనుల విందుగా సాగింది. భక్తులు గంధం చెల్లుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వామి వెంట నడిచారు. అడుగడుగునా కులమతాలకు అతీతంగా ప్రజలందరూ లాల్ స్వామికి ఫాతిహాలు జరిపారు. లాల్ స్వామికి గ్రామ సర్పంచ్ శంకరమ్మ భాయ్, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేషు రమేష్‌లు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక ఫాతిహాలు నిర్వహించారు. వీరి వెంట ఎంపిటిసి వరికూటి వెంకట్ రాముడు, వైసిపి నాయకులు వరికూటి సుబ్బన్న రెహమాన్, వరికుటి సుబ్బరాయుడు, లక్ష్మీ నాయక్, ఉప సర్పంచ్ ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రమణయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

లాల స్వామి(పిరుకు) ఫాతిహాల్ చేస్తున్న సాగునీటి సంఘం అధ్యక్షులు శేషు రమేష్ కుటుంబ సభ్యులు

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల
O.S. NO. 525/2017
D.అజయ్ నాయుడు. ...వాది
వర్సెస్
తల్లపనేని శివ ఏ శివ మహేష్ తండ్రి శ్రీనివాస రావు వయసు 29 సం. హిందూ, బిజినెస్, శివరామపురం గ్రామం, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా. ...ప్రతివాది
ప్రతివాది కి దావా సమన్లు
పై దావా నందు వాది ప్రతిపాది పై దావ దాఖలుచేసి ఉండి. బాండు బాపతి గాను డబ్బులు మొత్తం రాగోరి, ప్రతిపాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ.11-8-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను, లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకుతెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ.11-8-2023
ఇట్లు
అన్నమయ్య గారి బాలసుబ్బయ్య,
వాది పరం అడ్వకేట్,
నంద్యాల.